శ్రీవిద్యా

షోడశి మహామంత్రములు

(నాభీవిద్యా)

స్వామి పరమానందనాథ

శ్రీ గణపతి సచ్చిదానంద ప్రశస్తి అవార్డు గ్రహీత
విశిష్ట విద్యాశిరోమణి, ప్రముఖ శ్రీవిద్యా ప్రచారకులు,
చతుర్వేద భాష్యకారులు, శ్రీవిద్యాబ్రహ్మసూత్ర భాష్యకారులు
అవధూత దత్తపీఠ ఆస్థాన విద్వాంసులు,
ఇండియా కల్చరల్ సెంటర్ & టెంపుల్, అమెరికా
ఆస్థాన విద్వాంసులు, కనకాభిషేకగ్రహీత,
గండపెండేర సన్మానిత, సువర్ణ ఘంటాకంకణ,
శ్రీవిద్యారత్నాకర, శ్రీవిద్యావిశారద
డా॥ క్రోవి పార్థసారథి

ప్రకాశకులు :
డా॥ క్రోవి పార్థసారథి
23-11/1-10/2, ఓగిరాల వారి వీధి, సత్యనారాయణపురం,
విజయవాడ-520 011. సెల్ : 9866820574

శ్రీవిద్యా షోడశి మహామంత్రములు (నాభీవిద్యా)

స్వామి పరమానందనాథ

ప్రథమ ముద్రణ : 02-02-2020

ప్రతులు : 1000

వెల : రూ. 66-00

ప్రతులకు :

క్రోవి పార్థసారథి
23-11/1-10/2,
ఓగిరాల వారి వీధి,
సత్యనారాయణపురం,
విజయవాడ -520 011.
సెల్ : 9866820574

నాకు ఈ పుస్తకం ఎలా దొరికిందంటే.....?

విజయవాడలో సత్యన్నారాయణపురంలో మా ఇల్లు. గతంలో రైల్వే ట్రాక్ మా ఇంటి ప్రక్కనే ఉండేది. కొంతకాలం తరువాత రైలుపట్టాలు తీసి, ఆ ప్రదేశమంతా 80 అడుగులరోడ్డు వేశారు. దానికే బి.ఆర్.టి.ఎస్. రోడ్డు అని పేరు పెట్టారు. ఆ రోడ్డు మధ్యలో వేగంగా నడిచే బస్సులు నడపాలనే ఉద్దేశంతో రెండు బస్సులు నడిచే స్థలాన్ని కేటాయించారు. మధ్యలో ఆధునిక బస్ స్టాప్‌లు కూడా కట్టారు. కాని అక్కడ ఏ బస్సులు తిరగవు. ప్రస్తుతం పిల్లలు ఆడుకోవటానికి, బట్టలు ఆరవేసుకోటానికి, వయసు పెరిగినవాళ్ళు నడవటానికి మాత్రం ఉపయోగపడుతోంది ఆ రోడ్డు.

చిన్నప్పటి నుంచి వ్యాయామశాలకు వెళ్ళటం నాకు అలవాటు. కాలక్రమేణా వ్యాయామశాలను వదిలి ఉదయం, సాయంత్రం నడవటానికి అలవాటుపడ్డాను. ప్రతిరోజు బి.ఆర్.టి.ఎస్. రోడ్డుమీద నడుస్తుంటాను. మా యింటికి దగ్గరలోనే వారణాసి రామలింగేశ్వరశర్మగారు ఉంటారు. గతంలో వారు మాథ్స్‌లెక్చరర్, ప్రస్తుతము శ్రీవిద్యలో పూర్ణాదీక్షాపరులు. కళ్యాణానందభారతి సంప్రదాయం వారిది.

మా ఇంటికి ఇంకా దగ్గరలో దర్భా వెంకటేశ్వర్లు గారు ఉండేవారు. వారు రైల్వేలో స్టేషన్‌మాష్టరుగా పనిచేశారు. నాకన్న పెద్దవారు. వారికి లలితా సహస్రం, సౌందర్యలహరి వంటి వాటిమీద ఆసక్తి ఉంది. 2009లో నేను సహస్ర చండీ యాగము చేసినప్పుడు ఆయన కూడా వచ్చి, నేను సప్తశతి చదువుతుంటే పుస్తకం చూస్తుండేవారు. వారితోపాటుగా సరోవర్‌మెస్ ఓనరు రెడ్డిగారు కూడా వచ్చేవారు. దర్భా వెంకటేశ్వర్లు గారి పెద్ద కుమారుడు ఉమాశంకరు గారు. శ్రీవిద్యలో అందివేసిన చెయ్యి. పూర్ణదీక్షాపరులు. వీరికి శిష్యవర్గం కూడా బాగానే ఉంది. వీరిది కుడా కళ్యాణానందభారతి సంప్రదాయమే. నాది ఆ సంప్రదాయంకాదు. కాని కళ్యాణానంద భారతి తరువాత రెండవ పీఠాధిపతి అయిన శ్రీశ్రీశ్రీ **నృసింహానందభారతి** వారు పూర్వాశ్రమంలో మా అమ్మకు స్వయానా మేనమామ. చిన్నప్పుడు ఆయన నాకు తెలుసు. 'నరసింమావయ్య' అనే వాళ్ళం.

నేను ప్రతిరోజు ఈవెనింగ్ వాక్‌కు వెళ్ళినప్పుడు వారణాసి రామలింగేశ్వర శర్మగారు, దర్భా ఉమాశంకరు గారు కూడా వచ్చేవారు. ముగ్గురికీ శ్రీవిద్యలో పరిచయం ఉంది. కాబట్టి మంత్రాలు, అనుష్టానము, హోమాలు వీటిని గురించే తరచు మాట్లాడే వాళ్ళం.

ఒకరోజు మాటల సందర్భంలో 'దసరా పండగలో నేను షోడశీమహా మంత్రాలు హోమం చేశాను' అన్నారు ఉమాశంకరు గారు. షోడశి ఒకటే మంత్రం కదా? మరి 'మంత్రాలు' అంటారేమిటి అన్నాను.

శ్రీవిద్యలో షోడశి మహామంత్రాలు నలభై ఉన్నాయి అన్నారు ఉమాశంకరు గారు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. శర్మగారు కూడా వాటిని గురించి తెలియదు అన్నారు. నేను వెంటనే అవి ఎక్కడున్నాయి?' అని అడిగాను.

అందులో ప్రతి మంత్రము ఒక ఆటంబాంబు లాంటిది. అవి ఎక్కడా దొరకవు దాన్ని 'నాభీవిద్య' అంటారు అని చెప్పారు. ఉమాశంకరు గారు. అలాంటప్పుడు ఆ మంత్రాలు నాకు ఇవ్వండి. పుస్తకంగా అచ్చు వేయిద్దాం. విద్య నశించిపోకుండా చూద్దాం అన్నాను. ఈ విధంగా అసలు నాభీవిద్య గురించి తెలిసింది నాకు. శర్మగారు ఏం మాట్లాడకుండా వింటూ ఉండి పోయారు.

విద్యను సంపాదించుకోవటం జ్ఞానం. సంపాదించిన విద్యను దాచుకోవటం అజ్ఞానం.

విద్య మరుగునపడి పోకుండా పదిమందికీ చేరాలనే ఉద్దేశంతో దాన్ని పుస్తకంగా ప్రచురించాలని నా కోరిక. రామలింగేశ్వరశర్మగారికి పరిచయాలు చాలా ఎక్కువ. అందుకని ఏమైనా సరే ఆ పుస్తకం సంపాదించండి అని శర్మగారిని అడిగాను. శర్మగారు దానికోసం చాలా కష్టపడ్డారు. గతంలో అది అచ్చయింది. కాని ఎవరిదగ్గరా లేదు. చాలామంది దాన్ని ఉపాసన చెయ్యటంలేదు. కొంతమంది దానిపేరు కూడా తెలియదన్నారు. కొంతమంది అది మీకు అనవసరం అన్నారు. ఇంకొంతమంది మా దగ్గర ఉంది కాని

ఇవ్వం అన్నారు. అది పుస్తక రూపంలో పదిమందికీ ప్రచారం కావాలని అమ్మవారనుకుంటే, అదేదొరుకుతుంది అనుకున్నాము. శర్మగారు మాత్రం పట్టినపట్టు వదల్లా, విపరీతంగా శ్రమపడి రెండు నెలల తరువాత ఒక పి.డి.ఎఫ్. కాపీ సంపాదించారు. అది సంస్కృతంలో ఉంది. ఆ రోజున మాకు మహాదానందమైంది. ఈ రకంగా అనేక కష్టనష్టాలను ఓర్చి పుర్ణానందుల వారు వ్రాసిన **నాభీవిద్య సంస్కృతం కాపీ సంపాదించిన వారణాసి రామలింగేశ్వరశర్మగారికి అనేకానేక కృతజ్ఞతలు.**

అందులో నాభీవిద్య గురించి కొద్దిగా చెప్పి మంత్రాలు ఇచ్చారు. మొత్తం 14 పేజీలు ఉంది. ఇంతలో తెలుగులో కుడా ఒక కాపీ సంపాదించారు శర్మగారు. అందులో కేవలము మంత్రాలే ఉన్నాయి. అయితే ఈ రెండింటిలోను సంస్కృతం కాపీనే బాగుంది. అందుకని దాన్నే తీసుకుని **శ్రీవిద్యా షోడశి మహామంత్రాలు.** (నాభీవిద్య) అనే పేరుతో తెలుగులో పుస్తకం వ్రాశాను.

నిజంగానే ఇది చాలా గొప్పవిద్య. నాభివిద్యకు ఆనందభైరవుడు ఋషి. మరి ఆ మంత్రాలు మనం అనుష్ఠానం చెయ్యవచ్చా? అంటే వామకేశ్వర తంత్రంలోని ఖడ్గమాలను చదువుతున్నాం కదా? అలాగే ఇదికూడా. **నిషేధం వామాచారానికి అంతేకాని విద్యకు కాదు.**

ఇందులో పూర్తిగా షోడశి మహామంత్రాలు 40, హది, కాది, హాదికాది విద్యల సమ్మేళనంగా ఉంటాయి. వీటి వివరాలన్నీ లోపల ఇచ్చాను. నిజంగానే ఇది అత్యంతశక్తివంతమైన అణుబాంబులాంటిది. దీన్ని ఉపాసించాలంటే కనీసార్హత **పాదుకాంత పూర్ణదీక్ష.** పూర్ణదీక్షాపరులు కూడా, పూర్తిగా ధైర్యం ఉంటేనే ఈవిద్యను మీగురువు గారి అనుమతితోనే పారాయణ చెయ్యండి. అలా కాకపోతే దీనివల్ల వచ్చే కష్టనష్టాలకు మీరే బాధ్యులు.

శ్రీవిద్యాపరులు ఈ పుస్తకాన్ని దైవస్వరూపంగా భావించి, పూజా మందిరంలో ఉంచండి. కేవలము విద్య నశించిపోరాదనే భావనతో, పదిమందికీ చేరాలనే ఉద్దేశ్యంతో, ఈ గ్రంథాన్ని అతిసరళమైన భాషలో, అత్యంత సులువైన వివరణతో మీముందుకు తెస్తున్నాను.

నేనూ శ్రీవిద్యాపరుణ్ణే. నేను ఎందుకు చదవరాదు? అనే అహంకారంతో మాత్రం ఈ విద్యను ఉపాసించకండి. దీన్ని ఒకసారి పారాయణ చేస్తే, పంచదశీ మహామంత్రాన్ని లక్షసార్లు పారాయణ చేసిన ఫలం వస్తుంది. ఇది జ్ఞానప్రదము, మోక్షకారకము. ఈ విద్యను **నేను వెయ్యిసార్లు పారాయణ, నూటపదిసార్లు హోమము చేసి ఈ పుస్తకాన్ని ప్రచురిస్తున్నాను.**

ఒకరోజున పారాయణ చేస్తున్న సమయంలో ఆకుపచ్చ రంగు చీరె కట్టుకుని, 50-60 వయసున్న ఒకావిడ వచ్చి, నా ఎదురుగా కూర్చున్నది చాలాసేపు. మళ్ళీ చూస్తే ఎవరూ లేరు. సాక్షాత్తు ఆ త్రిపురసుందరే వచ్చి కూర్చున్నది అనుకున్నాను.

అత్యంత శక్తివంతమైన ఈ విద్యను అతిజాగ్రత్తగా, గురువుగారి అనుమతితోనే ఉపాసించండి. అని మరొక్కమారు మనవి చేస్తూ...

అసలు నాభీవిద్య ఒకటున్నది అని తెలియ చేసిన **శ్రీదర్భా ఉమాశంకరు** గారికి,

నాభీవిద్య సంస్కృతం కాపీ సంపాదించి పెట్టిన **శ్రీ వారణాసి రామలింగేశ్వర శర్మ** గారికి,

ఈ పుస్తకం మీద తన అభిప్రాయాన్ని తెలియచేసిన పుష్పగిరిపీఠ ఆస్థాన విద్వాంసులు శ్రీ గరిమళ్ళ సోమయాజులు శర్మ గారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ....

వికారి నామ సంవత్సర
మాఘ శుద్ధ సప్తమి (రథసప్తమి)
శనివారం 01-02-2020

భవదీయుడు
స్వామి పరమానందనాథ
(డా॥ క్రోవి పార్థసారథి)

గమనిక

నాభీవిద్యలో తేడాలున్నాయి. ఋషులను బట్టి మంత్రాల సంపుటీకరణలో తేడాలు కనిపిస్తున్నాయి. గమనించగలరు.

పుష్పగిరి పీఠ ఆస్థాన విద్వాంసులు
గరిమళ్ళ సోమయాజుల శర్మ

శ్రీముఖము

అపూర్వ షోడశీ విద్య

డా॥ క్రోవి పార్థసారథి గారు ప్రచురించిన **'శ్రీవిద్యా – షోడశీ మహా మంత్రములు'** అను గ్రంథమును జదివి మిక్కిలి ఆనందించితిని. ఇది యొక విలక్షణమైన గ్రంథము.

డా॥ పార్థసారథి గారు సుమారు 25 సంవత్సరముల నుండి యించుమించు 50 గ్రంథముల వరకు బ్రకటించిరి. ఇవి యన్నియు నెక్కువగా శ్రీవిద్యకు, మంత్ర శాస్త్రమునకు సంబంధించినవి. 4,5 గ్రంథములు బ్రహ్మసూత్రములకు, నద్వైత వేదాంతమునకు సంబంధించినవి. వీనిలో **శ్రీవిద్యా బ్రహ్మసూత్రభాష్యము** బ్రహ్మ సూత్రములకు శ్రీదేవీపరముగా, మంత్రశాస్త్రము సమన్వయముతో కూడిన ఉద్గ్రంథము. వీరు రచించిన **'చతుర్వేద భాష్యము'** వేదముల స్వరూపమును వివరించునదై వేద పండితులకు, సామాన్య పండితులకు గూడ నుపయోగపడు గ్రంథరాజము. వీరు రచించిన **విష్ణు సహస్రనామ భాష్యము, లలితా సహస్రనామ భాష్యము, సౌందర్యలహరీ వ్యాఖ్య, సప్తశతి వ్యాఖ్య** మొదలగునవి కేవలము శ్రీవిద్యోపాసకులకు, మంత్రశాస్త్రపరులకే కాక సామాన్య సాహిత్య రసికులకు, భగవద్భక్తులకు గూడ వినియోగపడు గ్రంథములు.

ప్రస్తుత గ్రంథము షోడశీ మహా మంత్రమునకు సంబంధించినది. దీని నెవరు ప్రకటించిరో, యెప్పుడు ప్రకటించిరో, యే గ్రంథములోనిదో యిదమిద్ధముగా దెలియదు. అతిప్రాచీనమై యత్యంత శిథిలావస్థలో దేవనాగరలిపిప్రతి వీరికి లభించినది. ఆ ప్రతినాధారముగా జేసికొని

వీరాంధ్రానువాదముతో దీనిని బ్రకటించిరి. ప్రస్తుతము శ్రీవిద్యాపరులు అనుష్టించు షోడశీ మహామంత్రమునకు, నీ గ్రంథములో నున్న షోడశీ మహా మంత్రములకు గొన్నిచోట్ల భేదము కన్పట్టుచున్నది. గ్రంథము ప్రాచీనమైనదగుటచే ఇది కూడా నేదో యొక ప్రాచీన పరంపరా సంప్రదాయమునకు చెంది ఉండును. మంత్ర శాస్త్రజ్ఞులు పారాయణము చేయు మంత్రములలో నెవరి బీజాక్షర సంపుటిని వారనుసంధానము చేయుచున్నారు. కాబట్టి యీ షోడశిమహామంత్ర సంపుటి ఆనందభైరవుని సంప్రదాయముననకు ప్రతీకగా నున్నది. దీనిలో ననేక మంత్రములనులోమ, విలోమ పద్ధతులలో ననేక విధములుగా నుపదేశింపబడినవి. ఆనందభైరవుడు వామమార్గమునకు సంబంధించినను, దక్షిణమార్గీయులు కూడ నీమంత్ర సంపుటులను గైకొని కృతకృత్యులు కావచ్చును.

ఒక ప్రాచీన శిథిల ప్రతిననుసరించి షోడశీవిద్యా మంత్రములను దెలుఁగు పాఠకులకందించిన యీ గ్రంథకర్త ధన్యులు. గ్రంథములను రచించుటలో, ప్రకటించుటలో డా॥ పార్థసారథి గారు పరిశ్రమించుచున్న తీరద్భుతమైనది. వీరిట్లే యనేక గ్రంథములను రచించి శ్రీవిద్యా వరివస్య గావించు నవకాశము వీరికనుగ్రహించుగాక యని శ్రీమహాకాళీ, మహాలక్ష్మీ, మహాసరస్వతి స్వరూపిణి, శ్రీవిద్యాదిదేవత యగు శ్రీదుర్గాదేవిని మాటి మాటికి వేడుకొనుచున్నాను.

శ్రీమత్పరమేశ్వరార్పణమస్తు

విజయవాడ,

14-1-2020

ఇట్లు

సకల బుధజన విధేయుడు

గరిమళ్ళ సోమయాజుల శర్మ

విషయసూచిక

డా॥ క్రోవి పార్థసారథి గారి

71వ జన్మదినం సందర్భంగా

ఈ గ్రంథము

ఆవిష్కరింపబడుతున్నది.

ఇట్లు

శ్రీమతి గునుపూడి శైలజ

శ్రీమతి రాపాక మంజూష

క్రోవి కృష్ణకాంతశర్మ

1. శ్రీవిద్య

బ్రహ్మపదార్థాన్ని 1.నిరాకారము 2.సాకారము అని రెండు విధాలుగా చెప్పటం జరుగుతోంది.

1. నిరాకారము: బ్రహ్మపదార్థానికి ప్రత్యేకంగా ఒకరూపం అనేది లేదు. చరాచర జగత్తంతా పరబ్రహ్మస్వరూపమే. ఛాందోగ్యోపనిషత్తులో చెప్పినట్లుగా పరబ్రహ్మ నాలుగు పాదాలుగా ఉంటుంది.

1. తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం. దశదిశలు బ్రహ్మమే.
2. నదీనదాలు, అడవులు, కొండలు, ఎడారులు, పర్వతాలు, లోయలు అన్నీ బ్రహ్మమే.
3. ఆకాశంలో ప్రకాశించే సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, మెరుపులు అన్నీ బ్రహ్మమే.
4. ప్రాణంబ్రహ్మ దృష్టిబ్రహ్మ, శ్రోత్రంబ్రహ్మ.

దీన్ని బట్టి చరాచర జగత్తంతా పరబ్రహ్మ స్వరూపమే అనే విషయం తెలుస్తోంది. అలాగే పరమేశ్వరుడు ఎక్కడున్నాడు? అన్నప్పుడు **ఇందుగల డందులేడను సందేహము వలదు ఎందెందు వెతకి చూచిన అందందే గలడు** అంటాడు ప్రహ్లాద కుమారుడు తన తండ్రియైన హిరణ్యకశ్యపుడితో. అంటే పరమేశ్వరుడు, పరబ్రహ్మ సర్వాంతర్యామి. చరాచర జగత్తంతా ఆక్రమించి ఉన్నాడు.

సృష్టి ప్రారంభానికి ముందు జగత్తంతా శూన్యంగా ఉండేది. ఆ శూన్యాన్ని ఆక్రమించి ఉన్నాడు పరబ్రహ్మ. సృష్టి జరిగిన తరువాత 84 లక్షల జీవరాశి రూపంలో ఈ జగత్తంతా ఆక్రమించి ఉన్నాడు. అందుకే సర్వకాల సర్వావస్థల యందు పరబ్రహ్మ ఈ జగత్తంతా ఆక్రమించి ఉన్నది. జగత్తులోని 84 లక్షల రకాలైన ప్రాణికోటి అంతా పరబ్రహ్మ ప్రతిరూపమే. ఈ రకంగా పరమేశ్వరుడు సర్వాంతర్యామి. అతనికి ప్రత్యేకంగా ఒక రూపంలేదు. అన్ని రూపాలు అతనివే. అందుకే అతడు ఆకారం లేనివాడు. నిరాకారుడు.

మానవుడు మరణ కాలంలో దేన్ని గురించి ఆలోచిస్తాడో, మరణం తరువాత దాన్నే పొందుతాడు. ధనాన్ని గురించి ఆలోచిస్తూ మరణిస్తే, మరుజన్మలో మంచి ధనికుడౌతాడు. స్త్రీని గురించి విచారిస్తూ ప్రాణాలు వదిలితే, మరుజన్మలో స్త్రీగా జన్మిస్తాడు. నిరాకార బ్రహ్మమును గురించి ఆలోచిస్తూ ప్రాణాలు వదిలితే నిరాకారాన్నే పొందుతాడు. అదే సాయుజ్యము, కైవల్యము, మోక్షము అంటారు. సాకార బ్రహ్మను గురించి ఆలోచిస్తూ ప్రాణాలు వదిలితే, సాకార బ్రహ్మను చేరతాడు. అంటే సాకార బ్రహ్మ ఉండే చోటికి చేరతాడు. అదే పరమపదము. మానవుడు పరమపదం చేరటాన్నే ముక్తి అంటారు. ముక్తి పొందిన మానవుడు.

విష్ణు భక్తుడైతే	–	వైకుంఠం చేరతాడు
శివభక్తుడైతే	–	కైలాసం చేరతాడు
అమ్మవారి భక్తుడైతే	–	మణిద్వీపము చేరతాడు

వీటినే పరమపదము అంటారు. మొత్తం మీద తేలింది ఏమంటే సాకార బ్రహ్మను ఉపాసించిన వాడు – పరమపదం చేరతాడు. అంటే ముక్తి పొందుతాడు. నిరాకారోపాసన చేసినవాడు – మోక్షం పొందుతాడు.

2. సాకారము : పరబ్రహ్మ నిరాకారము, నిర్గుణము. అయితే రూపంలేని దాన్ని ధ్యానించటం, ఉపాసన చెయ్యటం తేలికైన పనికాదు. మనసు లగ్నంకాదు. అందుచేత సాధకుడు ఒక రూపాన్ని సృష్టించాడు. **సాధకానాం హితార్థాయ బ్రహ్మణోరూపకల్పనా.** సాధకుడు తన కోరికలు తీరటం కోసం పరబ్రహ్మకు ఒక రూపాన్ని కల్పించాడు. అదే సాకార బ్రహ్మ. ఈ క్రమంలో కొంతమంది శ్రీమహావిష్ణువే పరమదైవము అన్నారు. వారి దృష్టిలో ఆయనే పరబ్రహ్మ. ముక్తిప్రదాత. ఆయన వైకుంఠంలో ఉంటాడు. కొంతమంది ఈశ్వరుడే పరమేశ్వరుడు అన్నారు. వారి దృష్టిలో ఆయనే పరమేశ్వరుడు. ముక్తిప్రదాత. మరణానంతరము విష్ణుభక్తులు వైకుంఠం చేరితే, శైవులు కైలాసం చేరతారు. మరికొంతమంది పరమేశ్వర తత్త్వాన్ని స్త్రీ రూపంలో ఉపాసించారు. ఆవిడే లలితాత్రిపురసుందరి, రాజరాజేశ్వరీ పరాభట్టారిక. త్రిభువనేశ్వరి. ఆమె మణిద్వీపంలో ఉంటుంది. అమ్మవారి ఉపాసకులు మరణానంతరము మణిద్వీపం చేరతారు. స్త్రీదేవతల మంత్ర తంత్రాలనే 'విద్య' అంటారు. **ముక్తిప్రదాత అయిన పరమేశ్వరిని అర్చించే మంత్ర, యంత్ర, తంత్రాలనే శ్రీవిద్య అంటారు.**

స్త్రీ దేవతలను అర్చించే విధానమంతా శ్రీవిద్య కాదు. దుర్గ, కాళి, చండి, వారాహి, ఛిన్నమస్త మొదలైన వారంతా కోరికలు తీరుస్తారు. అంతేకాని ముక్తిని ప్రసాదించలేరు. అలా ముక్తిని ప్రసాదించగలిగేది శ్రీచక్రనగరసామ్రాజ్ఞి అయిన లలితాత్రిపురసుందరి లేదా రాజరాజేశ్వరి పరాభట్టారిక మాత్రమే. అందుచేత ఆవిడ ఉపాసనలో గల మంత్ర, యంత్ర, తంత్రాలను మాత్రమే **'శ్రీవిద్య'** అంటారు. **దీనిమీద మరిన్ని వివరాలకు నేను వ్రాసిన 'శ్రీవిద్య' పుస్తకం చూడండి.**

శ్రీవిద్యలో మొదటి మంత్రం బాల. ఇది మూడక్షరాల మంత్రం. రెండవది పంచదశి. ఇది పదిహేనుఅక్షరాల మంత్రం. శ్రీవిద్యకు గాయత్రి వంటిది. శ్రీవిద్యలో అత్యంత ప్రాధాన్యత కలిగిన మంత్రం. ఆ తరువాత షోడశి. ఇది పదహారు అక్షరాల మంత్రం. మహాషోడశి అని ఇంకొక మంత్రమున్నది. అది ఇరవైఎనిమిది అక్షరాల మంత్రం. ఉపాసనక్రమంలో కొన్ని సంప్రదాయాల వారు పదహారుఅక్షరాలున్న షోడశి చెబితే, మరికొందరు ఇరవైఎనిమిదిఅక్షరాలున్న మహాషోడశి చెబుతారు. ఈ రెండూ మోక్షకారకాలే. ఈ మంత్రాలలోనే హాదివిద్య, కాదివిద్య, సాదివిద్య అని మూడు రకాలైన మంత్రాలున్నాయి. పంచదశీమహామంత్రం.....

1. హకారంతో మొదలైతే - హాదివిద్య
2. కకారంతో మొదలైతే - కాదివిద్య
3. సకారంతో మొదలైతే - సాదివిద్య

హాదివిద్యలోని మంత్రాలలో లోపాముద్ర ఉపాసించిన మంత్రము, కాదివిద్యలో మన్మథుడు ఉపాసించిన మంత్రము శ్రేష్ఠమైనవి. కాగా ఈ రెండింటినీ పరిశీలిస్తే **కాదివిద్యలోని కామరాజ మంత్రమే శ్రేష్ఠమైనది.**

పంచదశీమహామంత్రానికి శ్రీంకారము లేదా ఈంకారము చేర్చితే, దాన్ని షోడశాక్షరి అన్నారు. ఈ విషయం శంకర భగవత్పాదుల వారు, లొల్లా లక్ష్మీధరుడు కూడా ఒప్పుకున్నారు.

శ్రీవిద్యలో అమ్మవారికి ప్రతిరూపంగా పూజించే యంత్రాన్నే శ్రీచక్రము అన్నారు. ఇది తొమ్మిది ఆవరణలతో ఉంటుంది. తొమ్మిది ఆవరణలలో ఉన్న వివిధ దేవతలను అర్చించటాన్నే **నవావరణార్చన** అంటారు. ఇదే శ్రీచక్రార్చన. శ్రీచక్రము చరాచర

జగత్తుకు, విశ్వమానవాళికీ ప్రతీక. శ్రీచక్రాన్ని అర్చిస్తే చరాచరజగత్తును అర్చించినట్లే. విశ్వమానవాళిని అర్చించినట్లే, శ్రీచక్రం అనేక రకాలుగా ఉంటుంది. 1. భూప్రస్తారము 2.మేరుప్రస్తారము 3.కైలాసప్రస్తారము 4.అర్ధమేరువు 5. ఊర్ధ్వదళము 6. అధోదళము. ఇలా చాలా రకాలున్నాయి. దీనిమీద వివరాల కోసం **శ్రీవిద్య** పుస్తకము, **శ్రీచక్రము** వీడియో చూడగలరు.

అమ్మవారి పూజావిధానంలో తంత్రశాస్త్రాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. అరవై నాలుగు తంత్రాలు ప్రముఖంగా మనకు కనిపిస్తాయి. అయితే ఇవన్నీ లౌకికమైన కోర్కెల సాధనకు ఉపయోగిస్తాయి. కాగా మోక్షసాధనకు ఉపయోగించేవి **శుభాగ పంచకము** అనే 1.సనక 2. సనందన 3. సనత్కుమార 4. సనత్సుజాత, 5. వశిష్ట సంహితలు.

శ్రీవిద్యాపరులు ఎక్కువ మంది చక్రార్చన చేస్తారు. చక్రార్చన అంటే దేవికి చాలా ఇష్టం. సామాన్యంగా షోడశి ఉపదేశమున్నవారే చక్రార్చన చేస్తారు. కాని కొన్ని సంప్రదాయాలలో పంచదశి ఉన్నవారు కూడా చక్రార్చన చేస్తున్నారు. ఇది వారి సంప్రదాయం.

అలాగే **వనదుర్గామహావిద్యాపంచశతి**. ఇది ఐదువందలమంత్రాలు గల మాలామంత్రం. దీనికి అధిదేవత వనదుర్గ. దీనిలో కొన్ని వేదమంత్రాలు కూడా ఉన్నాయి. వాటిని గురుముఖతః చెప్పుకోవాలి. దీనిలోని రెండవ భాగంలోని 27వ మంత్రం **మహాపాదుక.** కాబట్టి పాదుకాంతపూర్ణదీక్షాపరులే దీన్ని పారాయణ చెయ్యాలి. అయితే కేవలము పంచదశిమాత్రమే ఉన్నవారు కూడా వనదుర్గా మహావిద్య పారాయణ చెయ్యటం నేను చూశాను. మీరు ఎలా చేస్తున్నారు? అని అడిగితే "మా గురువుగారు చెయ్యమన్నారు. మహాపాదుక ఉన్నచోట గురుమంత్రం చెప్పమన్నారు" అని సమాధానం చెప్పారు. వాళ్ళ గురువుగారు పెద్దవారు. చదువుకున్న వారు కాబట్టి మనం ఏమీ అనలేం. అది వారి సంప్రదాయం. అంతే. భిన్న సంప్రదాయాలున్నప్పుడు గురుసంప్రదాయాన్ని మాత్రమే పాటించాలనేది ఆర్యోక్తి. అలాగని శాస్త్ర విరుద్ధంగా చేస్తే ఇబ్బందులు ఎదురు కావచ్చు. జాగ్రత్త.

చండీ సప్తశతి. ఇది ఏడువందల శ్లోకాలు గల మాలామంత్రం. దీనికి అధిదేవత చండి. కాబట్టి చండీనవాక్షరి ఉపదేశం ఉన్నవారు ఎవరైనా దీన్ని పారాయణ చెయ్యవచ్చు.

శ్రీవిద్యాపరులంతా పారాయణ చేసేది లలితా సహస్రము. దీనికి అధిదేవత లలితా త్రిపురసుందరి. ఆఖరు శ్లోకంలో **శ్రీశివా శివశక్త్యైక్యరూపిణి లలితాంబికా** అన్నారు. అయితే షోడశిసహస్రనామం వేరే ఉన్నది. ఇది 152 శ్లోకాలుగా ఉంటుంది.

కళ్యాణీ కమలాకాళీకరాళీ కామరూపిణీ

కామాఖ్యా కామదా కామ్యా కామనా కామచారిణీ

కాని ఎక్కువమంది శ్రీవిద్యాపరులు లలితాసహస్రాన్నే పారాయణ చేస్తారు.

శ్రీవిద్యలో ప్రముఖమైనది చక్రార్చన. శ్రీచక్రంలోని నవావరణలలోను ఉండే దేవతలను పేరుపేరునా అర్చించటాన్నే నవావరణార్చన లేదా చక్రార్చన అంటారు. ఈ దేవతలందరిపేర్లు ఖడ్గమాలలో చెప్పబడ్డాయి. ముందుగా న్యాసము చెప్పుకుని, షోడశనిత్యలను అర్చించి, గురుమండలాన్ని అర్చించి, ఆ తరువాత తొమ్మిది ఆవరణలలో ఉండే దేవతలను పేరుపేరునా అర్చించి ధూపదీప నైవేద్యాలు సమర్పించాలి. తొమ్మిదవ ఆవరణలో. మహాకామేశ్వరి, మహాకామేశ్వరులను అర్చించిన తరువాత వారి వెసులుబాటునుబట్టి లలితాసహస్రనామ పారాయణ, శ్రీయాగము చేస్తారు.

ఆవరణార్చన అన్ని సంప్రదాయాలవారికి ఒకటే. కాకపోతే పాత్రాసాధనలోనే తేడాలున్నాయి. చక్రార్చనకు ఒకపాత్ర దగ్గర నుండి ముప్ఫైపాత్రల వరకు పెట్టే వారున్నారు. ఇవన్నీ వారి వారి సంప్రదాయాలు.

చక్రార్చనకు గుంటూరులోని **శ్రీశృంగేరీ శ్రీవిరూపాక్ష పీఠం** పెట్టింది పేరు. ఇది **కళ్యాణానంద భారతి వారి పీఠంగా ప్రసిద్ధి.** ఇక్కడ అందరూ శ్రీవిద్యోపాసకులే, పాదుకాంత పూర్ణదీక్షాపరులే. ఆంధ్రదేశంలో కళ్యాణానంద భారతి సంప్రదాయమే ఎక్కువ ప్రాచుర్యంలో ఉంది. ప్రస్తుత కాలంలో శ్రీవడ్లమూడి వేంకటేశ్వరరావు గారు ఈ పీఠానికి సంబంధించిన ప్రముఖ శ్రీవిద్యోపాసకులు. పోతుకూచి శ్రీరామ్మూర్తి గారి వంటి వారు కూడా ఈ పీఠానికి సంబంధించిన వారే. కళ్యాణానందభారతి శిష్యులే. శ్రీవిద్యలో చక్రార్చనకు పేరెన్నికగన్నది ఈ పీఠం. ఇప్పటికి కూడా ప్రతిమాసంలోను అష్టమి, పౌర్ణమి, మూలానక్షత్రం వంటి రోజులలో ఈ పీఠంలో చక్రార్చన జరుగుతుంటుంది. శ్రీవిద్యకు సంబంధించిన ప్రముఖ పీఠం అంటే బహుశా ఇదేనేమో?

చివరగా ఒక మాట. ఒక సంప్రదాయంలో ఉన్నప్పుడు ఇతర సంప్రదాయాల లోని మంత్రాలు, ధర్మాలు, ఆచారాలు మనం ఆచరించవచ్చా? **మంచి విషయాలు ఎక్కడున్నా గ్రహించవచ్చు** అనేది ఆర్యోక్తి. పద్మం బురదలో పుట్టినంత మాత్రం చేత దాన్ని వదిలెయ్యం. జాతిరత్నం పెంటదిబ్బలో దొరికినా తీసుకుంటాం. అలాగే గొప్ప విషయాలు ఏ సంప్రదాయంలో ఉన్నా మనం గ్రహించవచ్చు. బ్రహ్మసూత్రాల లోని మూడవ అధ్యాయం, మూడవపాదంలోని రెండవ అధికరణ **ఉపసంహారాధికరణము.** ఇందులో ఒక శాఖలోని గుణాలు, ధర్మాలు వేరొకశాఖలోకి అన్వయించవచ్చన్నాడు వ్యాసభగవానుడు.

శ్రీవిద్యాపరులంతా అత్యంత శ్రద్ధగా చదివేది, శ్రీచక్రంలోని నవావరణలలోని దేవతలను వివరించేది అయిన **ఖడ్గమాల** వామకేశ్వర తంత్రంలోది. ఈ తంత్రం వామాచారులకు అత్యంత ప్రామాణికము. అంత మాత్రంచేత ఖడ్గమాలను వదలి వెయ్యలేదు కదా? అలాగే నాభీవిద్యకూడా, దీనికి ఆనంద భైరవుడు ఋషి. వామాచార పరాయణుడు. అంత మాత్రం చేత దీన్ని కాదనాల్సిన పనిలేదు. షోడశిహృదయానికి కూడా ఆనందభైరవుడే ఋషి. మనం మంత్రాన్ని ఉపాసిస్తున్నాము అంతేకాని వామాచారం చెయ్యటం లేదు.

యత్రాపి భోగో నచతత్రమోక్షః యత్రాపిమోక్షో నచతత్రభోగః

శ్రీసుందరీసేవనతత్పరాణాం భోగశ్చ మోక్షశ్చ కరస్థ ఏవ ॥

లోకంలో భోగం కావాలంటే, మోక్షముండదు. మోక్షం కావాలంటే భోగముండదు. కాని అమ్మవారిని అర్చించేవారు మాత్రం జీవించినంత కాలం సుఖాలనుభవించి, మరణానంతరము మోక్షం పొందుతారు. అది శ్రీవిద్య గొప్పతనం.

ముందుగా నా గురుదేవులైన **విరజానందనాథ, సదానందనాథ, శుకానంద నాథులకు** సాష్టాంగ దండ ప్రమాణాలాచరించి, శ్రీవిద్యాపరులందరికీ శతసహస్ర వందనాలర్పించి, ఎక్కడో మరుగునపడిపోయిన నాభీవిద్యను మీ ముందుకు తెస్తున్నాను, మంత్ర శాస్త్రంలో ఇది కొన్నివందల అణుబాంబులతో సమానమైనది. పాదుకాంతపూర్ణదీక్షాపరులు కానివారు దీన్ని పారాయణ చెయ్యటానికి సాహసించవద్దు. కేవలము ఇంత గొప్పవిద్య నాశనం కాకూడదనే దృష్టితోనే దీన్ని మీ ముందుకు తెస్తున్నాను.

౨. శ్రీవిద్య తాంత్రికమా? ... వైదికమా?

చాలారోజులక్రితం జరిగిన యధార్థ సంఘటన.

ఒకసారి విజయవాడలో టి.టి.డి. కళ్యాణ మంటపంలో మా తోటి లెక్చరర్ గారి కుమార్తె వివాహానికి వెళ్ళాను. పెండ్లికుమారుడి వైపువారంతా శ్రీవిద్యా పూర్ణదీక్షాపరులు. ఆచారాలు, సంప్రదాయాలు కూడా కొంచెంఎక్కువే. వాళ్ళ గురువుగారు కౌతానరశింహశాస్త్రి గారు, గుంటూరు హిందూ కాలేజిలో లెక్చరర్‌గా పనిచేసి పదవీవిరమణ చేశారు. దాంతో వాళ్ళ గురువుగారిని, తోటి సహాధ్యాయులని, వేదపండితులని చాలామందిని వివాహవేడుకకు పిలిచి సత్కరించారు పెండ్లికుమారుని తల్లిదండ్రులు. నరసింహశాస్త్రి గారు పెద్దవారు. 70 సంవత్సరాలు దాటాయి. ఆయన గొప్ప శ్రీవిద్యోపాసకులని పేరు. శ్రీవిద్యకు సంబంధించి కొన్ని గ్రంథాలు కూడా వ్రాశారు. అందరిలోకి పెద్దవారు. చదువుకున్న వారు అందరికీ పరిచయస్తులు.

సన్మానకార్యక్రమం పూర్తయింది. వేదపండితులు కొంతమంది ఆయన దగ్గరకు వచ్చి 'ఏం మావాఁ ! బాగున్నావా?' అంటూ పలకరించారు. మాటల సందర్భంలో విషయం శ్రీవిద్య మీదకి మళ్ళింది. వేదపండితులంతా ఒక్కసారిగా మూకుమ్మడి దాడి చేశారు నరశింహశాస్త్రి గారి మీద. శ్రీవిద్య పూర్తిగా తాంత్రిక విద్య. కావాలంటే నిరూపిస్తాము. భోజనాలయిన తరువాత, సాయంత్రం ఐదుగంటలకు కూచుందాం. ధైర్యం ఉంటే రా ! అంటూ సవాలు విసిరారు. వాళ్ళు పదిమంది ఉన్నారు. గోలగోలగా అరుస్తున్నారు. నరసింహశాస్త్రి గారు ఒక నవ్వు నవ్వి ఊరుకున్నారు. తరువాత భోజనాలు చేసి ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు గునుపూడి జంగాలు మాదిరిగా. అంతకు మించి ఏమీ జరగలా. అంతవరకు శ్రీవిద్య వైదికమా? తాంత్రికమా ? ఈ అనుమానం నాక్కుడారాలా ! అప్పుడే మొదటిసారి దాన్ని గురించి ఆలోచించాను. ఇంతకీ శ్రీవిద్య వైదికమా? తాంత్రికమా?

ఈ విషయం తెలుసుకోవాలంటే ముందుగా వైదికమంటే ఏమిటి? తాంత్రిక మంటే ఏమిటి? అనే విషయాలు తెలుసుకోవాలి. మంత్రశాస్త్రంలో

వైదికా ప్రణవైర్యుతా ప్రణవేనవిహీనంతు తాంత్రికా ఏవః పరికీర్తితా ॥

ప్రణవము అంటే ఓంకారము. మంత్రంలో గనక ఓంకారమనేది ఉంటే అది వైదికము అని, ఓంకారం లేకపోతే తాంత్రికము అని సూత్రము. శ్రీవిద్యలోని ప్రధానమైన బాల, పంచదశి, షోడశి మంత్రాలలో ఓంకారం కనిపించదు. ఈ కారణం చేతనే శ్రీవిద్యను తాంత్రికవిద్య అంటారు.

వేదంలో చెప్పిన విద్యను వేదవిద్య, వైదికము అంటారు. వేదంలోని చివరి భాగమైన ఉపనిషత్తులలో విద్యలు (మంత్రాలు, ఉపాసన) చెప్పబడ్డాయి. ఉదాహరణకి **నారాయణోపనిషత్తులో నారాయణ మంత్రం** అష్టాక్షరి చెప్పబడింది.

ఓమిత్యేకాక్షరం, నమ ఇతి ద్వేక్షరే, నారాయణేతి పంచాక్షరాణి । ఏతద్వై నారాయణ స్యాష్టారం పదమ్ అలాగే **గోపాలతాపినీ ఉపనిషత్తులో క్లీం కృష్ణాయ గోవిందాయ గోపీజనవల్లభాయ స్వాహా** అంటూ గోపాల మంత్రం చెప్పబడింది. ఈ విధంగా ఎక్కడా శ్రీవిద్యా మంత్రాలు చెప్పబడలేదు కాబట్టి శ్రీవిద్య వేదవిద్య కాదు అని వారి వాదన.

ఇది కేవలము అవగాహనాలోపం. మేమే గొప్పవారం అనే చిన్న అహంకారం. మీరు చెప్పేది తప్పు. మీకేమీ తెలియదు అనే చులకనభావం. అంతకన్నా ఏమీకాదు. ముందుగా శ్రీవిద్యలో ప్రణవము ఉన్నదో లేదో చూద్దాం.

ఓంకారము ప్రణవము. అలాగే శాక్తేయంలో శక్తిప్రణవాలు అని ప్రత్యేకంగా ఉన్నాయి. అవి **శ్రీం హ్రీం క్లీం ఐం సౌః.** ఈ ఐదు శక్తి ప్రణవాలు. బాలా మంత్రంలో ఐం క్లీం సౌః ఈ మూడూ ప్రణవాలే ఉంటాయి. షోడశి మహామంత్రంలో పంచదశి మహా మంత్రానికి ముందు ఎనిమిది, తరువాత ఐదు బీజాక్షరాలుంటాయి. శ్రీం హ్రీం క్లీం ఐం సౌః ఓం హ్రీం శ్రీం ఇందులో ఏడుశక్తి ప్రణవాలు, కాగా ఎనిమిదవది ఓంకారము. చివర ఉండే ఐదు **సౌః ఐం క్లీం హ్రీం శ్రీం** ఇవన్నీ శక్తి ప్రణవాలు. ఈ రకంగా షోడశి మహామంత్రంలో ఓంకారంతో పాటుగా పన్నెండు శక్తి ప్రణవాలున్నాయి. అంటే మొత్తం పదమూడుసార్లు ప్రణవం చెప్పబడింది. మరి ఇంత గొప్ప మంత్రం ఇంకెక్కడుంటుంది? ఏ మంత్రంలోనైనా ఇన్నిసార్లు ప్రణవాన్ని చెప్పటం జరిగిందా? ఒకసారి ఆలోచించండి. ఇక వేదంలో శ్రీవిద్యను చెప్పారా? ఈ విషయం చూద్దాం. వేదంలోని సంహితలో కాకుండా, మంత్ర తంత్రాలన్నీ ఉపనిషత్తులలో చెప్పారు.

ఋగ్వేదానికి సంబంధించిన **త్రిపురోపనిషత్తు**లోని రెండవ మంత్రం చివరలో

కామాయోనిః కమలావజ్రపాణిః గుహాహసా మాతరిశ్వాఽభ్రమింద్రః పునర్గుహా సకలా మాయయాచ పురూచ్యేషా విశ్వమాతాది విద్యా

ఇక్కడ సాంకేతిక పదాలతో శ్రీవిద్య చెప్పబడింది. అది ఎలా ? అంటే –

కామో (క) యోనిః (ఏ) కమలా (ఈ) వజ్రపాణి (ల) గుహా (హ్రీం)

హసా (హస) మాతరిశ్వా (క) భ్ర (హ) మింద్రః (ల) పునర్గుహా (హ్రీం)

సకలా (సకల) మాయయా (హ్రీం)

ఇది ఉపనిషత్తులో చెప్పబడిన పంచదశిమహామంత్రం.

త్రిపురతాపినీ ఉపనిషత్తులోని మొదటి అధ్యాయంలో గాయత్రీ మంత్రము, పంచదశీ మహామంత్రము ఒకటే అని నిరూపించారు. అలాగే **త్రిపురసుందరీ ఉపనిషత్తు**లో దక్షిణామూర్తి ఋషిః। పంక్తి చ్ఛందః। లలితాత్రిపురసుందరీ దేవతా। ఐం బీజం। సౌః శక్తిః। క్లీం కీలకమ్. క ఏ ఈ ల హ్రీం। హ స క హ ల హ్రీం। స క ల హ్రీం ॥ ఇతి మంత్రః అని చెప్పబడింది.

ఈ రకంగా శ్రీవిద్యామంత్రాలలో ప్రణవము ఉన్నది. పంచదశి మహామంత్రము ఉపనిషత్తులలో ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ కుడా చెప్పబడింది. అటువంటప్పుడు ఇంక శ్రీవిద్య వేదవిద్య కాక తాంత్రిక విద్య ఎలా అవుతుంది? ముమ్మాటికీ శ్రీవిద్య వేదవిద్యే. ఇందులో ఏ మాత్రం సందేహం లేదు.

3. బాలామంత్రము

శ్రీవిద్యలో మొదటగా చెప్పేది బాలామంత్రము. ఎవరీ బాల? ఈ విషయం ఒకసారి చూద్దాం.

బ్రహ్మమానసపుత్రుడు కశ్యపప్రజాపతి. అతడికి దితివల్ల జన్మించిన వాడు వజ్రాంగుడు. ఇతనిభార్య వరాంగి. వీరికుమారుడు తారకుడు. బ్రహ్మనుగురించి ఘోరమైన తపస్సుచేసి, ఈ సృష్టిలో ఉన్న ఏ జీవివల్లా మరణం లేకుండా వరం పొందాడు. వరబలంతో విర్రవీగిపోయాడు. దేవతలను, తాపసులను నానాబాధలు పెడుతున్నాడు. వీరంతా విష్ణుమూర్తిని శరణువేడారు. విష్ణువు దేవతలను, ఋషులను వెంటపెట్టుకుని హిమాలయాలకువెళ్ళి, అక్కడ పరాశక్తినిగూర్చి పన్నెండు సంవత్సరాలు తపస్సు చేశారు. అప్పుడు ఆ దేవి వారికి ప్రత్యక్షమై, తనఅంశ హిమవంతుని ఇంట కుమార్తెగా పుడుతుంది, "ఆ బాలికకు, ఈశ్వరుడికి వివాహం చెయ్యండి. వారికి కలిగే బాలుడు తారకాసురసంహారం చేస్తాడు" అని చెప్పింది.

దక్షయజ్ఞంలో దాక్షాయణి దగ్ధమైపోయిన తరువాత, ఈశ్వరుడు విరాగియై, హిమాలయాల్లో తపస్సు చేస్తున్నాడు. ఇక్కడ హిమవంతుని కుమార్తె హైమవతికి వివాహ ప్రయత్నాలు చేస్తున్నాడు హిమవంతుడు. ఈశ్వరుణ్ణి తప్ప ఇంకెవరినీ వివాహం చేసుకోనని తెగేసి చెప్పింది హైమవతి. ఆ సమయంలో ఈశ్వరుడి పైన బాణాలు ప్రయోగించాడు మన్మథుడు. దానికి కోపగించి, తన మూడవ కన్నుతో మన్మథుణ్ణికాస్తా భస్మంచేశాడు ఈశ్వరుడు.

ఆ సమయంలో చిత్రకర్ముడైన గణేశుడు ఆ బూడిద నుంచి బొమ్మను తయారుచేసి, దాన్ని బ్రహ్మదేవుడికి చూపించి ఎలాఉంది? అని అడిగాడు. **'భండ భండ'** (బాగు బాగు) అని దానికి ప్రాణం పోశాడు బ్రహ్మదేవుడు. రుద్రుని కోపాగ్నికి భస్మమైన మన్మథుడి బూడిద నుంచి పుట్టినవాడు కాబట్టి తమోగుణ ప్రధానుడైనాడు. అతడికి భండుడు అని నామకరణం జరిగింది. అతడే భండాసురుడు.

భండాసురుడు దేవతలమీద యుద్ధం ప్రకటించాడు. ముల్లోకాలు జయించాడు. ఋషులను, మునులను, దేవతలను నానాబాధలు పెడుతున్నాడు. భండాసురుణ్ణి సంహరించటానికి సాక్షాత్తు పరమేశ్వరియే చతురంగ బలాలతోను బయల్దేరింది.

పోరు ఘోరంగా సాగుతోంది. భండాసురుని ముప్పైమంది కుమారులు చాలా గొప్పగా యుద్ధం చేస్తున్నారు. వారిని సంహరించటానికి ఆ పరమేశ్వరిఅంశగా తొమ్మిది సంవత్సరాల బాలిక ఆవిర్భవించింది. ఆ బాలికయే బాలాత్రిపురసుందరి.

అరుణకిరణ జాలై రంచితాశావకాశా
విధృతజపటీకా పుస్తకాభీత హస్తా ।
ఇతర వరకరాఢ్యా పుల్లకల్హారసంస్థా
నివసతు హృదిబాలా నిత్య కళ్యాణ శీలా ॥

సంకల్ప మాత్రం చేతనే ఆవిర్భవించి, రాక్షస సంహారం చేసిన బాలాత్రిపుర సుందరి ఉపాసన అభీష్టప్రదము. శరన్నవరాత్రులలో ప్రతిరోజు ఉదయం బాల అర్చన జరుగుతుంది. మొదటిరోజు రెండుసంవత్సరాల బాలిక నుంచి, తొమ్మిదవ రోజు పదిసంవత్సరాలబాలిక వరకు అర్చన చేస్తారు. ఈ రకంగా చేసిన బాలాపూజ వల్ల గొప్ప ఫలితము ఉంటుంది. తొమ్మిది రోజులు పూజించే బాలికలకు విడివిడిగా పేర్లు కూడా ఉన్నాయి.

మొదటి రోజు	కుమారీ	దారిద్ర్య, దుఃఖ నాశనము
రెండవ రోజు	త్రిమూర్తి	దీర్ఘాయువు, పురుషార్థాలు
మూడవ రోజు	కళ్యాణి	విద్య, రాజభోగము
నాల్గవ రోజు	రోహిణి	రోగనాశనము
ఐదవ రోజు	కాళి	శత్రునాశనము
ఆరవ రోజు	చండిక	సంపత్కరము
ఏడవ రోజు	శాంభవి	రాజపూజ్యము, ధీశక్తి
ఎనిమిదవ రోజు	దుర్గ	కష్టమైన కార్యసాధన
తొమ్మిదవ రోజు	సుభద్ర	అభీష్ట ఫలదాయిని

ఈ రకంగా దసరా తొమ్మిదిరోజులు రజస్వలకాని బాలికను పూజించటాన్నే **బాలాపూజ, కుమారీపూజ** అని కూడా అంటారు.

బాలామంత్రంలో మూడు బీజాలుంటాయి.

వాగ్భవం ప్రథమ బీజం । కామరాజం ద్వితీయకం

తృతీయం శక్తి కూటాఖ్యం । నిగమ త్రితయోద్ధృతం

ఇత్థంకుమారీ విద్యయా బీజత్రయ ముదీరితం ॥

ఐం – వాగ్భవ బీజము

క్లీం – కామరాజ బీజము

సౌః – శక్తి బీజము

ఈ మూడు బీజములే బాలామంత్రము. ఈ బీజాక్షరాలను దుర్వాసుడు తన దేవీమహిమ్నస్తుతిలో వివరించాడు. ముందుగా వాగ్భవబీజము **ఐం**

వందే వాగ్భవ మైందవాత్మ సదృశం వేదాది విద్యాగిరో

భాషా దేశ సముద్భవాః పశుగతా శ్ఛందాంసి సప్తస్వరాన్

తాలా నృత్య మహోధ్వనీ స్త్రపకటయ త్యాత్మ ప్రసారేణయత్

తద్బీజం పదవాక్య మానజనకం శ్రీమాతృకే తే పరమ్ ॥

ఓ పరాత్పరీ నీ రూపమే అయిన వాగ్భవబీజానికి నమస్కరిస్తున్నాను. ఇది శ్వేతవర్ణము గలిగి, వేదాది సకలవిద్యలను, సకలవాక్కులను, సకలభాషలను, సకల ఛందస్సులను, సప్తస్వరాలు, తాళములు, ధ్వనులు అన్నింటినీ ప్రకాశింప చేస్తోంది. ఇంత మహాశక్తిశాలి అయిన వాగ్భవబీజాన్ని నేను ఉపాసిస్తున్నాను.

ఇప్పుడు రెండవదైన కామరాజబీజము – **క్లీం**

కామాన్కారణతాం గతా నగణితాన్ కార్యై రనేకైర్మహీ

ముఖ్యైః సర్వమనోగతా నధిగతాన్ మానై రనేకై స్ఫుటం

కామక్రోధ సులోభమోహ మదమాత్సర్యాది షట్కంచ య

ద్బీజం భ్రాజయతి ప్రణౌమి తదహం తే సాధు కామేశ్వరీ ॥

ఓ దేవీ ! కామరాజ బీజము సృష్టి స్థితి లయాలను నిర్వహించే త్రిమూర్తుల శక్తులను ప్రకాశింప చేస్తుంది. పంచభూతాలు, తన్మాత్రలు, త్రిమూర్తులు, సృష్టి స్థితి లయాలు, ఆయా దేవతల శక్తులను గోచరింప చేస్తుంది. అరిషడ్వర్గాలను జీవుల మనసుల యందు ఉత్పన్నము చేస్తుంది. అటువంటి కామరాజ బీజాన్ని ఉపాసిస్తున్నాను.

ఇప్పుడు మూడవదయిన శక్తి బీజము – సౌః

స్వాత్మశ్రీ విజితాజ విష్ణు మఘవ శ్రీపూరణైక వ్రతం
యద్విద్యా కవితా వితానలహరీ కల్లోలినీ దీపకం
బీజం యత్త్రిగుణ ప్రవృత్తి జనకం బ్రహ్మేతి యద్యోగినః
శాంతా సత్యముపాసతే తదిహతే చిత్తే దధే శ్రీపరే ॥

తల్లీ ! శక్తి బీజము త్రిమూర్తుల రూప విశేషాలను జయిస్తున్నది. వారు వారి పనులు సక్రమంగా నిర్వహించటానికి వారికి శక్తినిస్తుంది. ఉపాసకులకు విద్య, కవిత్వము సిద్ధింపచేస్తుంది. త్రిగుణాల ప్రవృత్తి కలిగిస్తుంది. యోగులకు సత్యాత్మకమైన బ్రహ్మము ఇదే. అటువంటి నీ శక్తిబీజాన్ని ఉపాసిస్తున్నాను.

ఈ మూడు శ్లోకాలలోను బాలామంత్రంలోని మూడు బీజాక్షరాల గొప్పతనాన్ని వివరించాడు దుర్వాసుడు. ఇంతగొప్పదనం గలిగిన బాలామంత్రాన్ని ఉపాసన చేస్తే అమోఘమైన ఫలితం వస్తుంది. సాధకుడి అన్ని కోరికలు తీరతాయి. బాలా మంత్రంలో అనేక రకాలున్నాయి. వాటిలో కొన్నింటిని చూద్దాం.

ఈ మంత్రాలన్నింటికీ దక్షిణామూర్తి ఋషిః గాయత్రీఛందస్సు, బాలాత్రిపురసుందరి దేవతా.

1. ఐం క్లీం సౌః – మూడు అక్షరాలు
2. హ్రీం క్లీం హ్సౌః – మూడు అక్షరాలు
3. ఐం క్లీం సౌః సౌః క్లీం ఐం – ఆరు అక్షరాలు
4. శ్రీం క్లీం హ్రీం ఐం క్లీం సౌః హ్రీం క్లీం శ్రీం – తొమ్మిది అక్షరాలు
5. ఐం క్లీం సౌః సౌః క్లీం ఐం ఓం హ్రీం శ్రీం – తొమ్మిది అక్షరాలు
6. ఐం క్లీం సౌః బాలా త్రిపురే స్వాహా – పది అక్షరాలు
7. ఐం క్లీం హ్సౌః బాలా త్రిపురే సిద్ధిందేహి నమః – 14 అక్షరాలు
8. హ్రీం శ్రీం క్లీం త్రిపురాభారతీ కవిత్వందేహి స్వాహా – 16 అక్షరాలు
9. శ్రీం హ్రీం క్లీం త్రిపురమాలినీ మహ్యాం సుఖం దేహి స్వాహా – 17 అక్షరాలు
10. హ్రీం హ్రీం హ్రీం ప్రౌఢ త్రిపురే ఆరోగ్యమైశ్వర్యం దేహి స్వాహా – 18 అక్షరాలు
11. హ్రీం శ్రీం క్లీం త్రిపురామదనే సర్వశుభం సాధయ స్వాహా – 18 అక్షరాలు

11. బాలా మాలామంత్రము

ఓం నమో భగవతి బాలాత్రిపురసుందరి అయుత సహస్రకోటి రుద్రగణసేవితే ప్రతాపిని జ్వల2ప్రజ్వల2మమ శత్రుతత్పుత్రకళత్ర బంధుసంక్షయంకురు2ఘట్స్వాహా1 నుద2పశ్చిమదిశం ధ్వంసయ2ఉత్తరదిశం నిరోధయ2పూర్వదిశం సంహారయ2దక్షిణదిశమనుత్పాదయ2భూత ప్రేతపిశాచ బ్రహ్మరాక్షస బేతాళ సర్వదేవతాప్రయోగాన్ భేదయ2 సకలప్రయోగా న్మారయ2 సకలవిషా న్నాశయ2 మహాత్రిపురసుందరి చతుర్దశ విద్యాః ప్రథయ2 నిఖిలఋషిగణసేవితే, లక్షకోటి రవిశశ్యాది మహాతేజస్స్వరూపధారిణి, నవకోటిశక్తిగణసేవితే, ఆనందరూపిణి, మమాభయందేహి2 సర్వదారిద్ర్యప్రశమనం కురు2 మమపుత్ర మిత్ర బంధూనాం క్షేమం కురు2 కల్పవృక్ష కామధేనూ ర్దేహి2 ఆం హ్రీం శం శం శ్రీం శ్రీం శ్రీం ఐం ఐం ఐం క్లీం క్లీం క్లీం సౌః సౌః సౌః క్లీం హుం హ్రీం హుం హ్రైం హుం హుం ఫట్స్వాహా । విజ్వల భిద కుండలినీస్వరూపిణి సకలకామినీ ర్మమవశంకురు 2 సకలదురాచారపురుషా న్నిహన 2 భక్ష2 సకల మూషకాది ప్రయోగాన్ ఛేదయ 2 సకలరాజా న్మమవశం కురు2 సకలరాజసైన్యాని మమ వశంకురు ఉ హ్రాం హ్రీం హ్రూం హ్రైం హ్రౌం హ్రః ఫట్స్వాహా ॥

బాలా హృదయం :

ఆం హ్రీం క్రోం । సౌః ఐం క్లీం । సౌః శ్రీం హ్రీం । బాలపరమేశ్వరి ఆవేశయ ఆవేశయ, ఆం హ్రీం క్రోం సౌః మమ హృదయే చిరం తిష్టతిష్ట హుం ఫట్ స్వాహా॥

ఇవే కాక ఇంకా అనేక రకాలైన మంత్రాలు, మాలామంత్రాలు కూడా ఉన్నాయి. బాలామంత్రాన్ని ఉపాసించిన వారికి అద్భుతమైన వాక్కు వస్తుంది. అందము, ఆకర్షణీయమైన శరీరం కలుగుతుంది. ఎంత కష్టమైన పనైనాసరే సాధించగల శక్తి కలుగుతుంది.

4.పంచదశీ మహామంత్రము

ఇది పదిహేను అక్షరాలు గల మంత్రము. శ్రీవిద్యలో ప్రసిద్ధమైనది. శ్రీవిద్యకు గాయత్రి వంటిది. గాయత్రీ మంత్రము బ్రాహ్మణుల కోసం ఏర్పడగా **పంచదశి మహామంత్రము అన్ని వర్ణాలవారికీ ఉపాశ్యము** అని అగస్త్యమహర్షి తన **'శ్రీవిద్యా దీపిక'** అనే గ్రంథంలో వ్రాశారు. కాబట్టి పంచదశీ మహామంత్రాన్ని బ్రాహ్మణులతో పాటుగా ఇతరులు ఏ జాతివారైనా, ఏ మతం వారైనా, ఏ కులం వారైనా చెయ్యవచ్చు. అయితే మంచి గురువుదగ్గర ఉపదేశం పొంది, మంత్రోపాసన చేస్తే మంచి ఫలితం ఉంటుంది. ఇక్కడ ఇంకొక విషయం ఏమంటే – జపం చేసేటప్పుడు, మంచి ఫలితం రావాలి అనుకున్నప్పుడు మంత్రము యొక్క పూర్వాపరాలు, దాని అర్థము, మంత్రాధిష్ఠాన దేవత, ఇవన్నీ క్షుణ్ణంగా తెలియాలి. మంత్రార్థం తెలియకుండా ఉపాసన చేస్తే, ఆ ఉపాసనకు ఫలితముండదు. అగ్నిహోత్రం లేని బూడిదలో నెయ్యి వేస్తే, ఏ రకంగా ఫలితముండదో, అలాగే అర్థం తెలియకుండా చేసిన మంత్రజపం వ్యర్థమై పోతుంది. అంతేకాదు. **"అర్థం తెలియకుండా శబ్దం పలికేవాడు, గంధపు చెక్కలు మోస్తూ కూడా వాటి వాసన గ్రహించలేని గాడిద వంటివాడు"** అంటారు భాస్కరరాయల వారు. కాబట్టి మంత్రార్థం పూర్తిగా తెలుసుకుని మాత్రమే మంత్రజపం చెయ్యాలి.

మంత్రజపం వల్ల రెండు రకాల ఫలితం వస్తుంది. 1.ఇహము 2.పరము. ఇక్కడ గుర్తించవలసిన విషయం ఏమంటే, ఇహం కావాలంటే పరం ఉండదు. అలాగే పరం కావాలంటే ఇహం ఉండదు.

యత్రా పి భోగో నచతత్ర మోక్షః యత్రాపి మోక్షో నచతత్ర భోగః
శ్రీసుందరీ సేవన తత్పరాణాం భోగశ్చ మోక్షశ్చ కరస్తయేవ ॥

కాని అమ్మవారికి సంబంధించిన పంచదశి మహామంత్రము ఇహాన్ని పరాన్ని కూడా ఇస్తుంది.

దేహము 1.స్థూలదేహము 2.సూక్ష్మదేహము 3.కారణదేహము అని మూడు రకాలుగా ఉంటుంది. అదే దేవత విషయంలో చూస్తే....

1. స్థూలదేహము – అమ్మవారి యొక్క విగ్రహరూపము
2. సూక్ష్మదేహము – అమ్మవారి మంత్రము
3. కారణ దేహము – అమ్మవారి యంత్రము

ఈ సూక్ష్మదేహము మళ్ళీ మూడు విధాలుగా ఉంటుంది.

1. సూక్ష్మము – పంచదశి మహామంత్రము
2. సూక్ష్మతరము – కామకలాక్షరము
3. సూక్ష్మతమము – కుండలినీశక్తి

పంచదశీ మహామంత్రము మూడు కూటములుగా మూడు భాగాలుగా ఉంటుంది. అవి

1. వాగ్భవకూటమి 2. కామరాజకూటమి 3. శక్తికూటమి. లలితా సహస్రంలో 85, 86, 87 నామాలలో పంచదశీ మహామంత్రాన్ని వివరించారు.

85. శ్రీమద్వాగ్భవకూటైక ముఖపంకజా,

86. కంఠాదికటిపర్యంతం మధ్యకూటస్వరూపిణీ

87. శక్తికూటైకతాపన్న కట్యథోభాగధారిణః

వీటిలో

1. వాగ్భవకూటమి శిరస్సు. ఇది ఋగ్వేదాత్మకము

శిరస్సు నుంచే పరావాక్కు ఉత్పన్నమయి నోటిద్వారా బయటకు వస్తుంది. అందుకే ఇది వాక్కుయొక్క భాగము 'వాగ్భవకూటమి' అంటారు.

2. కామరాజకూటమి – కంఠం నుంచి కటిప్రదేశం వరకు. ఇది యజుర్వేదాత్మకము

శరీరంలోని ఈ భాగంతోనే జీవి తనకోరికలు అనుభవిస్తుంది. అందుకే దీన్ని మన్మథభాగము, కామరాజకూటమి అంటారు.

3. శక్తికూటమి – కటిప్రదేశం నుంచి పాదాల వరకు. ఇది సామవేదాత్మకము. జీవి సంచరించటానికి అవసరమైన శక్తిగల కాళ్ళు ఇక్కడ ఉంటాయి. అందుకే ఇది శక్తికూటమి.

పంచదశి మహామంత్రము దేవికి ఆత్మస్వరూపము. శ్రీవిద్యకు ఇది గాయత్రి వంటిది అని గతంలోనే చెప్పుకున్నాం. ఇది ఆత్మసాక్షాత్కారం కలిగించి మోక్షానిచ్చే మంత్రము, చతుర్విధ పురుషార్థాలకు మూలము, అందుకే దీన్ని **మూలమంత్రము** అంటారు. ఈ విషయమంతా లలితా సహస్రంలోని...

88. ""మూలమంత్రాత్మికా. 89 మూలకూటత్రయ కలేబరా" నామాలలో వివరించారు.

దుర్వాసమహర్షి తన **దేవీ మహిమ్నస్తుతిలోని** 14వ శ్లోకంలో పంచదశీ మహామంత్రం యొక్క గొప్పదనాన్ని ఈ విధంగా చెప్పాడు.

ఇత్థం త్రీణ్యపి మూలవాగ్భవ మహా శ్రీకామరాజ స్ఫుర
చ్ఛక్త్యా ఖ్యాని చతఃశ్రుతి ప్రకటితా న్యుత్కృష్టకూటానితే
భూతర్తుశృతి సంఖ్య వర్ణవిదితా న్యారక్తకాంతే, శివే
యోజానాతి స ఏవ సర్వజగతాం సృష్టి స్థితి ధ్వంసకృత్ ॥

అరుణారుణ కాంతులతో ప్రకాశించే ఓ పరమేశ్వరీ । వాగ్భవ, కామరాజ, శక్తికూటములు గలది, నాలుగు వేదాలయందు ప్రతిపాదించబడినది అయిన పంచదశీ మహామంత్రాన్ని ఉపాసించే వాడు సర్వజగత్కర్త అంటే సాక్షాత్తు పరమేశ్వరుడే అవుతాడు.

పంచదశీ మహామంత్రము సామాన్యమైనది కాదు. గొప్ప మహిమగలది. ఈ మంత్రాన్ని జపించాలంటే పూర్వజన్మలో చేసిన సుకృతం ఉండి తీరాలి. సౌందర్యలహరిలోని మొదటి శ్లోకంలో చెప్పినట్లుగా

ప్రణతుం స్తోతుం వా కథమకృతపుణ్యః ప్రభవతి అన్నారు. లలితా త్రిశతి ఫలశృతిలో చెప్పినట్లుగా

యస్యనో పశ్చిమంజన్మ యదివా శంకర స్వయం
తేనైవ లభ్యతేవిద్యా శ్రీమత్పంచదశాక్షరి ॥

పంచదశీ మహామంత్రాన్ని ఉపాసించాలంటే అతడికి మరుజన్మ లేకుండా ఉండాలి. లేదా సాక్షాత్తు అతడే పరమేశ్వరుడు కావాలి.

అందుకే పంచదశీ మహామంత్రము జ్ఞానప్రదము, మోక్షకారకము అని చెప్పబడుతోంది. లౌకికంగా చూసినట్లైతే ఇది

ఆయుష్కరం పుష్టికరం పుత్రదం వశ్యకారకమ్
విద్యాప్రదం కీర్తికరం సుకవిత్వ ప్రదాయకమ్
సర్వసంపత్ప్రదం సర్వభోగదం సర్వసౌఖ్యదమ్
సర్వాభీష్టప్రదంచైవ శ్రీవిద్యాపఠనం భవేత్ ॥

పంచదశీ మంత్రోపాసన వల్ల ఆయురారోగ్య ఐశ్వర్యాలు, ధనధాన్యాలు, విద్య, కీర్తిప్రతిష్ఠలు, కవిత్వం, సర్వసంపదలు భోగభాగ్యాలు, ఒకటేమిటి? అన్ని కోరికలు తీరతాయి.

ఉపాసకులు: పంచదశీ మహామంత్రము చాలా గొప్పది. మానవుడికి కావలసిన కోరికలన్నీ తీరుస్తుంది. ముక్తిప్రదం కూడా. అన్నారు కదా ! మరి ఈ మంత్రాన్ని ఉపాసించిన వాళ్ళు ఎవరైనా ఉన్నారా? అంటే పూర్వకాలంలో ఈ మంత్రాన్ని అనేకమంది ఉపాసించి తరించారు. వాళ్ళలో...

మనుశ్చంద్ర కుబేరశ్చ లోపాముద్రా చ మన్మథః
అగస్తి నంది సూర్యశ్చ ఇంద్రో విష్ణు శ్శివస్తథా
క్రోధభట్టారకో దేవ్యా ఏతేముఖ్య ఉపాసకాః

1. మనువు	7. నందీశ్వరుడు
2. చంద్రుడు	8. సూర్యుడు
3. కుబేరుడు	9. ఇంద్రుడు
4. లోపాముద్ర	10. విష్ణువు
5. మన్మథుడు	11. శివుడు
6. అగస్త్యుడు	12. దుర్వాసుడు

ఈ పన్నెండు మంది ముఖ్యులు. మానసోల్లాసము, జ్ఞానార్ణవ తంత్రము వంటి గ్రంథాలలో కూడా వీరిపేర్లు ప్రముఖంగా చెబుతూ బలరాముడు, దత్తాత్రేయుడు అగ్నిదేవుడు కూడా శ్రీవిద్యోపాసకులే అన్నారు.

ఋషి: మంత్రాన్ని దర్శించిన వాడు ద్రష్ట. సృష్టించిన వాడు స్రష్ట. ఈ మంత్రాన్ని దర్శించి, ఉపాసించి ఈ లోకానికి తెచ్చిన వాడు మన్మథుడు. కాబట్టి అతడే ఈ మంత్రానికి ఋషి అంటారు కొందరు. కాగా దక్షిణామూర్తి ఋషి అని కొందరు, హయగ్రీవుడు, ఆనందభైరవుడు ఋషులని మరికొందరు చెబుతున్నారు. ఈ ఋషిని బట్టే సంప్రదాయం మారుతుంది. ఇంకా మనకు తెలియని వారు అనేకమంది ఋషులు ఉండచ్చు. అనేక సంప్రదాయాలుండవచ్చు. **ఏ సంప్రదాయాన్నీ చులకనగా చూడవద్దు.** ఎవరినీ అవమానించద్దు. ఇన్ని సంప్రదాయాలున్నప్పుడు మనం ఏ సంప్రదాయం పాటించాలి? అంటే – **గురుసంప్రదాయాన్నే పాటించండి.**

ఆచారాలు :

శ్రీవిద్యా సంప్రదాయంలో యతీశ్వరులకు, గృహస్థులకు కలిపి పది గురు పరంపరలున్నాయి. అవి

1. గిరి
2. సాగర
3. భారతి
4. పురి
5. అరణ్య
6. తీర్థ
7. ఆనంద
8. నాథ
9. సరస్వతి
10. ఆశ్రమ

వీరందరి ఆచార వ్యవహారాల్లో తేడాలుంటాయి. వీరు కాక ఇంకా అనేక రకాలైన ప్రసిద్ధమైన ఆచారాలున్నాయి.

1. కౌళాచారులు – వీరు 'ఆధారచక్రాన్ని' పూజిస్తారు.
2. క్షపణికులు – 'స్త్రీ యోనిని' పూజిస్తారు. పూర్వాది తంత్రాలు వీరికి ప్రమాణము.
3. కాపాలికులు – 'పంచామృత తంత్రము' వీరికి ప్రామాణికము
4. దిగంబరులు – రూపభేదము, భూతోడ్డారము, కులాసారము కులోడ్డీశము, కులచూడామణి, సర్వజ్ఞానోత్తరము, మహాకాళిమతము, అరుణేశము, మోదినీశము మొదలైన తంత్రాలు వీరికి ప్రామాణికాలు.

5. ఇతిహాసులు – 'భైరవయామళము' వీరికి ప్రామాణికము

6. వామాచారులు – 'వామకేశ్వరతంత్రము' వీరికి ప్రామాణికము

7. సమయాచారులు– వీరు బ్రహ్మవాదులు. శుభాగపంచకము వీరికి ప్రామాణికము.

వీరిలో కొందరు భగవంతుడికి జంతుబలులు, నరబలులు కూడా ఇస్తారు. స్మశానభైరవి, ప్రత్యంగిర, ఛిన్నమస్త వంటి ఉగ్రదేవతలను అర్చిస్తారు. ఐహిక వాంఛలే వీరి పరమావధి. మొత్తం మీద ఉపాసకులందరూ ఏదో ఒక రకంగా ఐహికవాంఛలలో కూరుకు పోతున్నారు. వీరిని రక్షించటానికి పార్వతీదేవి యొక్క కోరిక మీద ఈశ్వరుడు శ్రీవిద్యాతంత్రము అనే క్రొత్త తంత్రాన్ని చెప్పాడు.

శాక్తేయంలో కౌళాచారులకు – అరవై నాలుగు

మిశ్రమాచారులకు – ఎనిమిది తంత్రాలున్నాయి. కాగా

సమయాచారులకు – ఐదు తంత్రాలున్నాయి. వాటినే **శుభాగపంచకము** అంటారు. అవి 1.సనక 2.సనందన 3.సనత్కుమార 4.సనత్సుజాత 5.వసిష్ట సంహితలు. మొత్తం మీద ఉపాసకులను, వారు పాటించే ఆచార వ్యవహారాలను బట్టి నాలుగు రకాలుగా చెబుతారు.

1. కౌళాచారులు – వీరు అర్ధకామాలకే ప్రాధాన్యత ఇస్తారు.

కౌళాచారులు రెండు రకాలు 1. పూర్వకౌళులు 2. ఉత్తరకౌళులు. వీరిలో

1. పూర్వకౌళులు శ్రీచక్రాన్ని గీసి, అందులోని త్రికోణాన్ని పూజిస్తారు.

2. ఉత్తర కౌళులు స్త్రీ యొక్క ప్రత్యక్షయోనిని పూజిస్తారు.

2. సమయాచారులు – వీరు పూర్తిగా బ్రహ్మవాదులు. శివశక్తులకు భేదం లేదని నమ్ముతారు. మోక్షమే వీరి లక్ష్యము.

3. మిశ్రమాచారులు – వీరు కౌళ సమయాచారాలు రెండింటినీ నమ్ముతారు. ఇటు లౌకిక జీవితాన్ని వెళ్ళబుచ్చుతూనే మోక్షం గురించి ఆలోచిస్తారు.

4. వామాచారులు – వీరికి వామకేశ్వరతంత్రము ప్రామాణికము. పరమేశ్వరి పూజలో మకార పంచకాన్ని తప్పనిసరిగా వాడతారు. మకార పంచకము అంటే

మద్యం మాంసం తథామత్స్యం ముద్రా మైథునమేవ చ
శక్తి పూజావిధానాద్యైః పంచతత్త్వ ప్రకీర్తితః ॥

1. మద్యము 2. మాంసము 3. మత్స్యము 4. ముద్ర 5. మైథునాలు. **జ్ఞానార్ణవము** వంటి తంత్రాలు మకారపంచకం వాడటాన్ని పూర్తిగా ఖండించాయి.

పంచదశీ మహామంత్రానికి దక్షిణామూర్తి, హయగ్రీవుడు వంటి ఋషులున్నారని చెప్పుకున్నాం కదా. వారి ఆచారాలు సంప్రదాయాలు వేరువేరుగా ఉంటాయి.

గురుర్ దక్షిణామూర్తి దక్షిణాచార ప్రవర్తకః
హయగ్రీవ స్తదాచైవం వామేచ ఆనంద భైరవ ॥

దక్షిణామూర్తి – దక్షిచార (వైదికాచార) సంపన్నుడు

హయగ్రీవుడు – దక్షిణాచార సంపన్నుడు

ఆనందభైరవుడు – వామాచార సంపన్నుడు

ఈ రకంగా శ్రీవిద్యలో కూడా భిన్నమైన సంప్రదాయాలు, ఆచారాలు ఉన్నాయి. ప్రస్తుతము మనం చూడబోతున్న **నాభీవిద్య**కు ఋషి ఆనందభైరవుడు. కాబట్టి ఈ విద్య వామాచార సంప్రదాయానికి సంబంధించినది అనుకోవచ్చు. ఇక్కడ చిన్న అనుమానం వస్తుంది. "మనం వైదికాచారులం కదా? అలాంటప్పుడు వామాచార సంప్రదాయంలోని 'నాభీవిద్య'ను మనం ఉపాసించవచ్చా?" అని. దీనికి సమాధానం ఏమంటే, మనసంప్రదాయాన్ని మనం పాటిస్తూ, ఇతర సంప్రదాయాల్లో ఉన్న మంచి విషయాలు, గొప్ప విషయాలను మనం స్వీకరించవచ్చు. ఈ విషయాన్ని వ్యాసమహర్షి తన బ్రహ్మసూత్రాలలో అంగీకరించాడు. దీనికి అనుగుణంగానే వామకేశ్వర తంత్రంలోని ఖడ్గమాలను మనం తీసుకున్నాం. అలాగే 'నాభీవిద్య'కూడా.

హాది, కాది, సాది విద్యలు :

అకారము నుంచి క్ష కారము వరకు గల వర్ణసమామ్నాయాన్నే అక్షరములు అంటారు. అక్షరము అంటే క్షరము కానిది, నాశనము లేనిది. ఈ అక్షర సమామ్నాయము రెండు రకాలుగా ఉన్నది.

నృత్తావసానే నటరాజరాజో ననాథ ఢక్కాం నవపంచవారమ్ శివుడు తాండవం చేస్తున్న సమయంలో, సనకాది సిద్ధులను ఉద్ధరించాలనే కోరికతో తన ఢక్కను పద్నాలుగుసార్లు మ్రోగించాడు. అప్పుడు వచ్చిన శబ్దము పాణినిమహర్షికి అక్షర

సమామ్నాయంగా వినిపించింది. ఈ సమామ్నాయము పధ్నాలుగు సూత్రాలుగా ఉంది. వీటి ఆధారంగానే పాణిని **'అష్టాధ్యాయి'** అనే వ్యాకరణ గ్రంథం వ్రాశాడు. దీని ప్రకారం 'అ' నుంచి 'చ' వరకు అచ్చులు. 'హ' నుంచి 'ల' వరకు హల్లులు. అంటే అచ్చులు అకారంతోను, హల్లులు హకారంతోను మొదలవుతాయి. కాగా శబరవర్మ అనే పండితుడు శాబరతంత్రాన్ని వ్రాస్తూ 'అ' నుంచి 'అః' వరకు అచ్చులు, 'క' నుంచి 'క్ష' వరకు హల్లులు అన్నాడు. వీరిద్దరి మధ్య తేడా ఏమంటే పాణిని ప్రకారం హల్లులు హకారంతో మొదలైతే, శబరవర్మ ప్రకారం హల్లులు కకారంతో మొదలవుతాయి. అచ్చులు మాత్రం అకారంతో మొదలవుతాయనే ఇద్దరూ చెప్పారు.

హల్లులు హకారంతో మొదలైతే హాదివిద్య అని,
కకారంతో మొదలైతే కాదివిద్య అని అన్నారు.

అలాగే పంచదశి మహామంత్రము 'క' కారంతో మొదలైతే కాదివిద్య, 'హ' కారంతో మొదలైతే హాదివిద్య అన్నారు. హాదివిద్యలో యమనియమాలు బాగా ఉంటాయి. కాగా కాదివిద్యలో అవి చాలా తక్కువ. కర్మాచరణ విషయంలో స్వేచ్ఛ ఉంటుంది.

పంచదశీ మహామంత్రాన్ని పూర్వకాలంలో అనేకమంది ఉపాసించి తరించారు అని గతంలో మనం చెప్పుకున్నాం. వారిలో కొంతమంది కాదివిద్యగాను, కొంతమంది హాదివిద్యగాను ఈ మంత్రాన్ని ఉపాసించారు. ఇక్కడ ఎవరి మంత్రం వారిదే.

తేషుద్వా మనురాజౌతు వరిష్టా వింధ్య మర్దనః
లోపాముద్రా కామరాజా ఇతిఖ్యాతి ముపాగతా ।
హాదిస్తు లోపాముద్రాస్యా కామరాజాస్తు కాదికః
తయోస్తు కామరాజోఽయం సిద్ధిదో భక్తి శాలినః ॥

ఈ మంత్రాలన్నింటిలోను, హాదిమతంలో లోపాముద్ర కాదిమతంలో కామరాజ మంత్రము శ్రేష్ఠమైనవి. ఈ రెండింటిలోను చూస్తే కామరాజ మంత్రమే ప్రశస్తమైనది అంటున్నారు మంత్రవేత్తలు.

ఈ మంత్రాలలో కాదివిద్యకు దక్షిణామూర్తి ఋషి అని, హాదివిద్యకు హయగ్రీవుడు ఋషి అని, చెబుతుంటారు. కాని గ్రంథాలలో మాత్రం అన్ని మంత్రాలకు దక్షిణామూర్తినే ఋషిగా చెప్పటం జరిగింది.

శ్రీవిద్యలో కాదివిద్యను మొదటగా పరమేశ్వరుడు పార్వతీదేవికి ఉపదేశం చేశాడు. కొంతకాలం పాటు పార్వతీదేవి ఈ విద్యను ఉపాసించి తరువాత బ్రహ్మ సరస్వతులకు, వారు లక్ష్మీనారాయణులకు, వారు శివపార్వతులకు ఉపదేశించారు. వారి నుంచి ఇంద్రాది దేవతలకు, తరువాత సనక సనందనాది సిద్ధులకు, వారి నుంచి వసిష్టుడు, వ్యాసుడు, గౌడపాదుడు, శంకరుడు మొదలైన వారి ద్వారా గురుపరంపరగా మనకు వచ్చింది. ఇది ఒక సంప్రదాయం.

అయితే సంప్రదాయాన్నిబట్టి విద్యకు మూలపురుషులు మారుతుంటారు. ఇంకొక సంప్రదాయం ప్రకారం –

నారాయణం, పద్మభువం, వశిష్టం, శక్తిం, తత్పుత్రంపరాశరం, వ్యాసం, శుకం ఆ తరువాత గురుపరంపరగా మనకు వచ్చింది. ఇంకొక సంప్రదాయం ప్రకారం శ్రీవిద్యకు మూలపురుషుడు సదాశివుడు. ఇలా సంప్రదాయాలను బట్టి వీరు మారుతుంటారు.

హాదివిద్యలో మిత్రేశమయి, షష్టీశమయి, ఉడ్డీశమయి అంటూ ఖడ్గమాలలో చెప్పారు.

ఏది ఏమైనా **మంత్రశాస్త్రం అంతా ఈశ్వర ప్రోక్తమే.**

పంచదశీ మహామంత్రము అంటే పదిహేను అక్షరాల మంత్రము అని వేరుగా చెప్పనవసరం లేదు. కాని వివిధ మంత్రాలు చూసినప్పుడు, వాటిలోని అక్షరాలు పదిహేను కన్న ఎక్కువ ఉంటాయి. ఇప్పుడు హాది, కాది విద్యలలో చెప్పిన వివిధ రకాలైన పంచదశీ మహామంత్రాలను చూద్దాం. ఇక్కడ ఒక విషయం గమనించండి. సాదివిద్య అని ఇంకొకటున్నది. అందులో మంత్రాలు సకారంతో మొదలవుతాయి. ముందుగా 'కాదివిద్య'లో మంత్రాలను చూద్దాం. మొత్తం పన్నెండు మంది ఉపాసకులు అన్నాం కదా. వారిలో **ఐదుగురు 'కాదివిద్య'**ను ఉపాసించగా, **ఐదుగురు 'హాదివిద్య'**ను, **ఇద్దరు 'సాదివిద్య'**ను ఉపాసించారు.

పంచదశీ మహామంత్రాన్ని ఈ లోకంలోకి తెచ్చినవాడు మన్మథుడు. అయినప్పటికీ ఈ మంత్రాన్ని ఉపాసించి తరించినవారు చాలామంది ఉన్నారు. వారిలో మనువు, చంద్రుడు, కుబేరుడు, అగస్త్యుడు, లోపాముద్ర మొదలైన వారు ముఖ్యులు. అయితే...

1. మనువు 2. చంద్రుడు 3. కుబేరుడు 4. లోపాముద్ర 5. మన్మథుడు 6. అగస్త్యుడు 7. నందికేశ్వరుడు 8. సూర్యుడు 9. ఇంద్రుడు 10. విష్ణువు 11. శివుడు 12. దుర్వాసుడు. వీరందరూ ఉపాసించిన మంత్రానికి దక్షిణామూర్తే ఋషి. కాని మంత్రం మాత్రం వేరుగా ఉంటుంది. వీటన్నింటికీ సకుంకుమవిలేపనా... స్మరేదంబికాం. అనేదే ధ్యాన శ్లోకము. ఈ మంత్రాలు సాధన గ్రంథమండలి, తెనాలి, వారి **ఆమ్నాయమందారము**లో ఉన్నాయి.

కాదివిద్య : వీరిలో కాదివిద్య నుపాసించిన వారు ఐదుగురు. 1. మనువు 2. మన్మథుడు 3. ఇంద్రుడు 4. దుర్వాసుడు 5. కుబేరుడు. వీరు ఉపాసించిన మంత్రాలు చూడండి.

1) మనువిద్యా : ఇది మనువు ఉపాసించిన మంత్రము. ఇందులో 16 అక్షరాలుంటాయి.

అస్యశ్రీ మను విద్యాంబా మహామంత్రస్య। దక్షిణామూర్తి ఋషిః। అనుష్టుప్ఛందః। మనువిద్యాంబాదేవతా క హ ఏ ఈ ల హ్రీం బీజం। హ స క హ ల హ్రీం శక్తిః। సకల హ్రీం కీలకం। జపే వినియోగః।

క హ ఏ ఈ ల హ్రీం - అంగుష్టాభ్యాం నమః

హ స క హ ల హ్రీం - తర్జనీభ్యాం నమః

స క ల హ్రీం - మధ్యమాభ్యాం నమః

క హ ఏ ఈ ల హ్రీం - అనామికాభ్యాం నమః

హ స క హ ల హ్రీం - కనిష్టికాభ్యాం నమః

స క ల హ్రీం - కరతలకరపృష్టాభ్యాం నమః

ఈ విధంగానే హృదయన్యాసము

ధ్యానమ్ :

సకుంకుమవిలేపనా మళిక చుంబి కస్తూరి కాం
సమందహసితేక్షణా సచర చాపపాశాంకుశాం।
అశేష జనమోహినీ మరుణ మాల్యభూషాంబరాం
జపాకుసుమభాసురా జపవిధౌ స్మరే దంబికాం॥

మంత్రము : క హ ఏ ఈ ల హ్రీం । హ స క హ ల హ్రీం । స క ల హ్రీం।

2. మన్మథ విద్యా : ఇది మన్మథుడు ఉపాసించిన మంత్రము. ఇందులో 15 అక్షరాలుంటాయి.

అస్యశ్రీ మన్మథ విద్యాంబా మహామంత్రస్య । దక్షిణామూర్తి ఋషిః । అనుష్టుప్ఛంద్రః । శ్రీ మన్మథ విద్యాంబా దేవతా । క ఏ ఈ ల హ్రీం బీజం । హ స క హ ల హ్రీం శక్తిః । స క ల హ్రీం కీలకం । జపే వినియోగః । కూటత్రయముతో అంగన్యాస కరన్యాసములు.

ధ్యానమ్ :

సకుంకుమవిలేపనా మళిక చుంబి కస్తూరి కాం
సమందహసితేక్షణా సచర చాపపాశాంకుశాం ।
అశేష జనమోహినీ మరుణ మాల్యభూషాంబరాం
జపాకుసుమభాసురా జపవిధౌ స్మరే దంబికాం ॥

మంత్రము : క ఏ ఈ ల హ్రీం। హ స క హ ల హ్రీం । స క ల హ్రీం ।

3) ఇంద్ర విద్యా : ఇది ఇంద్రుడు ఉపాసించిన మంత్రము. ఇందులో 15 అక్షరాలుంటాయి.

అస్యశ్రీ ఇంద్రవిద్యాంబా మహామంత్రస్య। దక్షిణామూర్తి ఋషిః। పంక్తిశ్ఛంద్రః। శ్రీ ఇంద్రవిద్యాంబా దేవతా। క ఏ ఈ ల హ్రీం బీజం। హ స క హ ల హ్రీం శక్తిః । సకల హ్రీం కీలకం । జపే వినియోగః । కూటత్రయముతో రెండు ఆవృతులు న్యాసము.

ధ్యానమ్ :

సకుంకుమవిలేపనా మళిక చుంబి కస్తూరి కాం
సమందహసితేక్షణా సచర చాపపాశాంకుశాం ।
అశేష జనమోహినీ మరుణ మాల్యభూషాంబరాం
జపాకుసుమభాసురా జపవిధౌ స్మరే దంబికాం ॥

మంత్రము : క ఏ ఈ ల హ్రీం । హ స క హ ల హ్రీం । స క ల హ్రీం।

4) దుర్వాసవిద్యా : ఇది దుర్వాసుడు ఉపాసించిన మంత్రము. ఇందులో 18 అక్షరాలుంటాయి.

అస్యశ్రీ దుర్వాసవిద్యాంబా మహామంత్రస్య। దక్షిణామూర్తి ఋషిః। పంక్తిశ్ఛంధః। దుర్వాసవిద్యాంబాదేవతా। క ఏ ఈ ల హరీ బీజం। హ స క హ ల హరీ శక్తిః। సకల హరీ కీలకం। జపే వినియోగః।

కూటత్రయముతో రెండు ఆవృతులు అంగన్యాస కరన్యాసములు.

ధ్యానమ్ :

సకుంకుమవిలేపనా మళిక చుంబి కస్తూరి కాం
